క్లుప్తంగా

పేదలందరికీ పక్కా ఇళ్లు



మొవ్వ: పేదలందరూ పక్కా ఇళ్లు కట్టుకుని గౌరవంగా జీవించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక శ్రీ జానికి రామయ్య కల్యాణ మండపంలో శనివారం మన ఇల్లు–మన గౌరవం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ 2025 మార్చి నాటికి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసే విధంగా అన్ని వసతులు కల్పిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న గృహాలను సత్వరమే పూర్తి పూర్తి చేసుకుంటే మార్చిలోగా బిల్లులు పడతాయని తెలిపారు. కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, హౌసింగ్ ఎండీ రాజాబాబు, గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, మండల ప్రత్యేక అధికారి రాములు నాయక్ పాల్గొన్నారు.

కౌలు రైతులకూ నష్టపరిహారం ఇవ్వాలి

గుడివాడ టౌన్: బుడమేరు వరద కారణంగా పంట నష్టపోయిన కౌలు రైతులకూ పరిహారం ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు ప్రభుత్వ అధికారులకు ఈ మేరకు వినతిపత్రం సమర్పించామన్నారు. వరదల కారణంగా వరి పంట పూర్తిగా కుళ్లిపోయిందని రైతుకు ఒక గింజ కూడా వచ్చే అవకాశం లేనందున ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారాన్ని నేరుగా కౌలురైతుకు అందేలా చూడాలని కోరారు. కౌలు రైతులను ఆదుకునే ఉద్దేశంతో ఈ నెల 29 సాయంత్రం నందివాడ మండలం పుట్టగుంటలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని వరద బాధితుల ధర్నా



నందివాడ: మండలంలోని పెదవిరివాడ గ్రామంలో వరద ముంపునకు గురైన కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని శనివారం వరద బాధితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ అధికారులు తమను చిన్నచూపు చూస్తున్నారన్నారు. వరదల కారణంగా తాము తీవ్రంగా నష్టపోయామన్నారు. విలేజ్ రెవెన్యూ అధికారి పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ

గుడివాడ టౌన్: గుడివాడ రెవెన్యూ డివిజినల్ అధికారి(ఆర్డీఓ) గా జి. బాలసుబ్రహ్మణ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేయుచున్న బాలసుబ్రహ్మణ్యం ఉద్యోగోన్నతిపై ఆర్డీఓగా నియమితులయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గుడివాడలో ఆయన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించారు. తొలుత కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ బాలాజీ, ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు.

మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు మృతి

పమిడిముక్కల: మండలంలోని మంటాడ గ్రామానికి చెందిన పామర్రు నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు పుట్టి శివశంకర్(30) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. శివశంకర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివశంకర్ మృతికి మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు మేరుగ లక్ష్మి, నాయకులు కంభపు రాంబాబు, కోడెబోయిన కోటేశ్వరరావు సంతాపం తెలిపారు.

డాక్టర్ లక్ష్మణరావుకు జాతీయ ఉత్తమ అవార్డు



గుడ్లవల్లేరు: ఆప్టికాన్‌లో జాతీయ ఉత్తమ ఓరల్ ప్రజెంటేషన్ అవార్డు తనకు వచ్చినట్లు గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు శనివారం విలేకరులకు తెలిపారు. భువనేశ్వర్ ఉత్కల్ విశ్వవిద్యాలయం వారు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు భారత ఫార్మసీ అధ్యాపకుల సంఘానికి ఆప్టికాన్-2024 నిర్వహిస్తున్న ఈ సదస్సులో తాను పాల్గొని ఉత్తమ ఓరల్ ప్రజెంటేషన్‌ను సాధించినట్లు తెలిపారు. అధిక రక్త పీడనానికి వినియోగించే నిఫిడిపిన్‌ను అంచనా వేసే పద్ధతులపై ప్రజెంటేషన్ ఇచ్చిన తనకు 27వ తేదీన ఈ అవార్డును అందించినట్లు పేర్కొన్నారు. అవార్డు గ్రహీతను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

కూటమి ప్రభుత్వానిది పైశాచిక ఆనందం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్
- కలియుగ దైవాన్ని రాజకీయాల్లోకి లాగడంపై ధ్వజం
- చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని పూజలు



గోవిందనామ స్మరణతో మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయంలోకి ప్రవేశిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, పార్టీ శ్రేణులు



కైకలూరు మీసాల వెంకన్న ఆలయంలో పూజలు చేస్తున్న డీఎన్నార్, కారుమూరి



దోకిపర్రులో పూజలు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



గుడివాడ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వడ్లమన్నాడులో పూజలు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు



మండవల్లి శ్రీ కృష్ణాలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ పెద్దిరెడ్డి తదితరులు



గురజ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న నాయకులు



నందివాడలో నిర్వహించిన పూజలో పాల్గొన్న నాయకులు

పమిడిముక్కల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తూ, పైశాచిక ఆనందం పొందుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు తిరుమల పవిత్రతను, శ్రీవారి ప్రసాదం విశిష్టతను, టీటీడీ పేరు ప్రఖ్యాతలను మంటగలిపిన సీఎం చంద్రబాబు పాపాల ప్రక్షాళన కోసం శనివారం మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మంటాడ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గోవింద నామస్మరణచేస్తూ ఆలయ ప్రవేశం చేశారు. గోవిందా..గోవిందా అంటూ పార్టీ శ్రేణులు చేసిన నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి స్వామికి తులసి మాల సమర్పించి పూజా కార్యక్రమాలు జరిపి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ కలియుగ దైవాన్ని రాజకీయాల్లోకి లాగి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేకే కులాలు, మతాల పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. ఆయనకు దేవుడంటే గౌరవం లేదన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఎంతో పవిత్రంగా తీసుకునే లడ్డూ ప్రసాదాన్ని తినకుండా చేయడం సబబు కాదన్నారు. ఐదు మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూపై విష ప్రచారం చేస్తున్న సీఎం

గుడ్లవల్లేరు: తిరుమల లడ్డూపై విష ప్రచారం చేస్తున్న సీఎం చంద్రబాబు మనసు మార్చాలని కోరుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు గుడ్లవల్లేరు మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. దోకిపర్రు శ్రీ వెంకటేశ్వరాలయం, వడ్లమన్నాడు శ్రీ వేణుగోపాల స్వామి ఆలయాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మండలి హనుమంతరావు, కనుమూరి రామిరెడ్డి, కోటప్రోలు నాగు, కొడాలి సురేష్, శేషం గోపి, పెన్నేరు ప్రభాకర్, మండా దిలీప్, ముక్కు సోమేశ్వరరావు, జన్ను చిరంజీవి, కాయన హరిబాబు, కోటప్రోలు బాబూరావు, బలుసు జితేంద్ర, మేకల అనిల్, వెంకటేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించు స్వామీ

కైకలూరు: సీఎం చంద్రబాబుకు తిరుమల వేంకటేశ్వరస్వామి మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోరారు. ఏలూరు పార్లమెంటు సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌తో కలసి కైకలూరు మీసాల వెంకన్న స్వామి ఆలయంలో శనివారం పూజలు చేశారు. డీఎన్నార్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను 100 రోజుల పాలనలోనే టీడీపీ మోసం చేసిందన్నారు. వాటి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు తిరుమల లడ్డూ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారన్నారు. కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ దేవుడిని అడ్డుపెట్టుకుని చంద్రబాబు వైఎస్సార్ సీపీపై బురద జల్లుతున్నారన్నారు. కలిదిండి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యులు తమ్మిశెట్టి లక్ష్మీ, పట్టపు బాలమ్మ, బంటుపల్లి సాదు కొండయ్య, ప్రజాప్రతినిధులు చినరాజు, రఫీ, రాంబాబు, జయమంగళ కాసులు, శ్యాంసుందర్, శేషావతారం, నాగరాజు, వెంకటేశ్వరరావు, రవికుమార్, నాంచారయ్య, వెంకటేశ్వరరావు, నెహెమియా, సోబుల సత్యనారాయణ, ఉలిసి సత్యనారాయణ, మోహనరావు, కృష్ణమూర్తి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాలను రాజకీయాలకు వాడుకోవడం దారుణం

గుడివాడ టౌన్: దేవుని సన్నిధానాన్ని సైతం రాజకీయాలకు వాడుకునే దుస్థితి రాష్ట్రంలో రావడం దురదృష్టకరమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు అన్నారు. స్థానిక వాసవి చౌక్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల వేంకటేశ్వర స్వామి సన్నిధికి వెళ్లాలనే ప్రయత్నాన్ని అడ్డుకోవడం నీచ రాజకీయాలకు నిదర్శనం అన్నారు. వాస్తవానికి జగన్నాథపురంలోని పాటిమీద గల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు పూజలు నిర్వహించడానికి సైతం పోలీసులు అడ్డుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలేటి చంటి, కె. ఆంజనేయప్రసాదు, చుండూరి శేఖర్, ప్రసాదు, కృష్ణారావు, కృష్ణమోహన్, రమణకుమార్, నాని, జోషి, మూడెడ్ల ఉమ, రమీజ, రాణి తదితరులు పాల్గొన్నారు.

– రూరల్ మండలం దొండపాడులో తిరుపతి లడ్డూపై అసత్య ప్రచారంపై స్వామికి వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ గద్దే పుష్పరాణి, మాజీ సర్పంచ్ గద్దె రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా శ్రీను ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: తిరుమల శ్రీవారి లడ్డూ పవిత్రతను దెబ్బతీసేలా మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన పాపానికి ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని గురజ శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీవేణుగోపాల స్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు పూజలు చేశారు. హౌసింగ్‌బోర్డు మాజీ డైరెక్టర్ గంటాసంధ్య, నాయకులు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, మంచాల సరస్వతి, మేడూరి వెంకటేశ్వరరావు, రామకృష్ణ, వెంకటరమణ, అల్లాభక్షు, వసంతరావు, సుబ్బారావు, నాగు, ఆంజనేయులు, రమాదేవి పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: తిరుపతి లడ్డూపై సీఎం చంద్రబాబు చేసిన దుష్ప్రచారం, పాప ప్రక్షాళన చేసేందుకు వైఎస్సార్ సీపీ నేతలు నందివాడ కోదండ రామాలయములో శనివారం పూజలు నిర్వహించారు. ఎంపీపీ ఆదాం, నాయకులు కొండపల్లి రంగారెడ్డి, కందుల నాగరాజు, తోట నాగరాజు, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, సుందర్రావు, ఎంపీటీసీ సభ్యురాలు రంగమ్మ, ప్రసాద్, నాగూర్, శ్రీను, మురళీ పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలతో రాద్ధాంతం

మండవల్లి: టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని ఆరోపిస్తున్న చంద్రబాబు జూలై 23 నుంచి రిపోర్టు ఎందుకు బయట పెట్టలేదని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్(రాము) అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీ కృష్ణాలయంలో వైఎస్సార్ సీపీ నేతలు పూజలు చేశారు. ఏఎంసీ కన్వీనర్ చేబోయిన వీర్రాజు, మాజీ సొసైటీ అధ్యక్షులు, బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, గుడివాడ సత్యవరప్రసాద్‌లు, కృష్ణ, శ్రీనివాసరావు, సురేష్, వి.శివరామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ప్రయోగం విఫలం



దేవస్థానం రోడ్ల వద్ద కాపలాకాస్తున్న పోలీసులు

గుడివాడ టౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించాలనే పిలుపు మేరకు కార్యకర్తలు, నాయకులు పూజలకు సిద్ధమైన నేపథ్యంలో గుడివాడ పోలీసులు వారిని అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున మోహరించారు. ఆలయానికి గల నాలుగు ప్రధాన రహదారుల్లో కేవలం ఒక వ్యక్తి నడవడానికి మాత్రమే అవకాశం ఉండేలా బారికేడ్లు ఏర్పాటు చేశారు. శనివారం కావడంతో అధిక సంఖ్యలో సాధారణ భక్తులు ఆలయానికి వచ్చే ప్రయత్నం చేశారు. ప్రతి ఒక్కరినీ నిలిపి పేరు కనుక్కొని వారు సాధారణ భక్తుడని నమ్మితేనే ఆలయంలోకి అనుమతించారు. ఏ క్షణాన్నైనా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున వస్తారని పోలీసులు ఎదురు చూస్తున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాసవీచౌక్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వాహించారు. సాధారణంగా మధ్యాహ్నం 12.30 గంటల వరకు పోలీసులు కాపలాకాశారు. ఆలయం మూసినా కార్యకర్తలు రాకపోవడంతో తాము విజయం సాధించామని పోలీసులు భావిస్తుండగా అనుకున్న ప్రకారం వైఎస్సార్ సీపీ నాయకులు పట్టణంలో పూజలు నిర్వహించడంతో పోలీసులు అవాక్కవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



నిమ్మకూరు(పామర్రు): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. నిమ్మకూరులోని ఏపీ ఆర్ఎస్ స్కూల్లో ఏర్పాటు చేసిన లైబ్రరీని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, ఏపీఆర్ఎస్ పాఠశాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

పామర్రు: మహాకవి గుర్రం జాషువా జయంతి వేడుకలను స్థానిక శివరామ థియేటర్ కాంప్లెక్స్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు సంక్షేమ సంఘ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఆవుల ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జాషువా సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన రచనలు గబ్బిలం, పరదేశి, ముంతాజ్ మహల్ అన్నారు. సమాజాభివృద్ధికి జాషువా చేసిన సేవలు ఎంతో ఆదర్శవంతమైనవన్నారు. పేదల అభ్యున్నతికి ఆయన చేసిన మేలు మరువలేనిదని తెలిపారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వనపూడి సురేంద్రకుమార్, పాస్టర్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రముఖ న్యాయవాది డేవిడ్ రత్నకుమార్, జనసేన నాయకులు సుబ్బు శనగల, బ్రహ్మేశ్వరరావు, ప్రసాద్, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మూఢాచారాలపై తిరగబడ్డ మహోన్నతుడు గుర్రం జాషువా అని అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి కార్యవర్గ సభ్యుడు శాంతరాజు, పాగోలు అభిష, సామాజిక కార్యకర్తలు ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా స్థానిక సెంటర్‌లో అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జాషువా చిత్రపటానికి వేసి నివాళులర్పించారు.

ప్రజల మధ్య సమతా భావాన్ని పెంపొందించాలి

నిమ్మకూరు(పామర్రు): సమాజం సుభిక్షంగా ఉండాలంటే హిందూ ధర్మ సూత్రాలకు అనుగుణంగా ప్రజల మధ్య సమతా భావాన్ని పెంపొందించాలని పామర్రు ప్రఖండ విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు అరిగెల బాలుడు పేర్కొన్నారు. మండలంలోని నిమ్మకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్, టీటీడీ ధర్మప్రచార పరిషత్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆధ్యాత్మికమైన భావనను పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండల పరిధి రాపర్ల ఎస్సీ కాలనీకి చెందిన భజన సమాజం ఆధ్వర్యంలో ధర్మప్రచార భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ట్రస్టు వారు భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో అన్న ప్రసాద సేవా ట్రస్టు చైర్మన్ సూరపనేని చంద్రశేఖర్, కార్యదర్శి నందమూరి జయశంకర్ ప్రసాద్, సమరసత మండల అధ్యక్షుడు పొనుగుమాటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేస్ట్ టు ఆర్ట్ పోటీలు

మొవ్వ: వేస్ట్ టు ఆర్ట్ పోటీలను శనివారం స్థానిక శ్రీ మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని కాజ, కోసూరు, నిడుమోలు, కూచిపూడి, పెడసనగల్లు, మొవ్వ గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు పెదముత్తేవిలోని ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు పాల్గొని వందకు పైగా అంశాలను ప్రదర్శించారు. ఈ పోటీలను మండల విద్యాశాఖాధికారి–2 కే శ్రీలక్ష్మి పర్యవేక్షించారు. మొవ్వ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కుర్చీ, సోఫా అంశం ప్రథమ స్థానంలో నిలిచింది. పెదముత్తేవి విద్యార్థులు ప్రదర్శించిన గాంధీజీ జీవిత చరిత్రకు, నిడుమోలు విద్యార్థులు ప్రదర్శించిన అయోధ్య రామలయ నమూనాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. వచ్చే నెల మొదటి వారంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో మండల స్థాయిలో ప్రతి పాఠశాల నుంచి ఒక్కొక్క అంశాన్ని పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

■ అక్కినేని వారధి వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

నందివాడ: నందివాడ మండలం కుదరవల్లిలోని అక్కినేని వారధి వద్ద శనివారం సీసీ కెమెరాలను అమర్చారు. కుదరవల్లి అక్కినేని వారధి కృష్ణా జిల్లా సరిహద్దు కావడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలని ఉద్దేశంతో టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మసిముక్కు వేణు గోపాలరావు ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నందివాడ ఎస్ఐ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అక్కినేని వారధి కృష్ణా జిల్లా సరిహద్దు కావడంతో శాంతి భద్రతల దష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

■ పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ

పామర్రు: పేద విద్యార్థికి దాతల సహకారంతో ల్యాప్‌టాప్‌ను అందజేయటం అభినందనీయమని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పేద విద్యార్థికి శనివారం ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. మంత్రి మాట్లాడుతూ మండలంలోని కురుమద్దాలికి చెందిన ఎన్ఆర్ఐ కొసరాజు వెంకట్ సౌజన్యంతో అదే గ్రామానికి చెందిన బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుకునే పేద విద్యార్థి వంగలపాటి వరుణ్‌కు రూ. 70వేల విలువ గల ల్యాప్‌టాప్‌ను బహూకరించడం ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజ, నాయకులు పాల్గొన్నారు.

■ పామర్రు సబ్‌రిజిస్ట్రార్‌గా అనంతలక్ష్మి

పామర్రు: పామర్రు సబ్ రిజిస్ట్రార్‌గా ఎ.అనంతలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆమెను మండల దస్తావేజులేఖరులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ అనంతలక్ష్మి మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రతిఒక్కరి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటానన్నారు. లేఖరుల సంఘ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఉదయ్‌కిరణ్, కోశాధికారి నందిపాటి వెంకట రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు గోగినేని సుబ్బారావు పాల్గొన్నారు.

■ మన ఇల్లు- మన గౌరవం గ్రామ సభ

ముదినేపల్లి రూరల్: మండలంలోని ముదినేపల్లి, వడాలి సచివాలయాల పరిధిలో స్వచ్ఛతా హి సేవ-2024 గ్రామసభలు శనివారం జరిగాయి. వడాలిలో మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్, ఎంపీడీవో పి.మల్లీశ్వరి ఆధ్వర్యంలో మన ఇల్లు–మన గౌరవంపై గ్రామసభ నిర్వహించారు. టీడీపీ నాయకులు నరసింహరావు, పంచాయతీ కార్యదర్శి సంగమయ్య పాల్గొన్నారు. ముదినేపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఐసీడీఎస్ అధికారి ప్రసూన పాల్గొన్నారు.

■ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

గుడ్లవల్లేరు: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల పరిషత్ ఏఓ ఇమ్రాన్ తెలిపారు. స్థానిక సచివాలయ ఆవరణలో లబ్ధిదారులకు మన ఇల్లు–మన గౌరవం పేరిట అవగాహనా సదస్సును నిర్వహించారు. గ్రామ కార్యదర్శి నరసింహారావు, మాజీ సర్పంచ్‌లు చాపరాల బాలాజీ, పల్లెం నరసింహారావు పాల్గొన్నారు.

■ పిరమిడ్ ధ్యాన కేంద్ర కార్యాలయం ప్రారంభం

నందివాడ: శ్రీ సాంబశివ పిరమిడ్ హౌస్‌లో శనివారం కృష్ణా జిల్లా పిరమిడ్ ఆధ్యాత్మిక కార్యాలయం బ్రహ్మర్షి జక్కా రాఘవరావు, బ్రహ్మవిద్వరిష్ట స్వర్ణలత శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని రాజకుమారి తెలిపారు.

■ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కైకలూరు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి పేర్కొన్నారు. కైకలూరు వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో లబ్ధిదారులతో గ్రామసభ శనివారం నిర్వహించారు. మన ఇల్లు-మన గౌరవం, స్వచ్ఛతా హి సేవ, స్వర్ణాంధ్ర-2047, ఇది మన ప్రభుత్వం వంటి కార్యక్రమాలను వివరించారు. గృహనిర్మాణశాఖ ఏఈ శేఖర్, కూటమి నేతలు రామచంద్రరావు, కారుణ్య పాల్గొన్నారు.

■ మండవల్లిలో..

మండవల్లి: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన స్థానిక సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

■ మహనీయులకు ఘన నివాళి

గుడివాడ టౌన్: భావితరాలకు ఆదర్శంగా నిలిచిన మహనీయులు గుర్రం జాషువా, భగత్‌సింగ్ లాంటి వారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్. సమరం అన్నారు. స్థానిక ఎస్పీఎస్ హైస్కూల్లో భగత్‌సింగ్, గుర్రం జాషువాల జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. హైస్కూల్ హెచ్ఎం టీఎంఈ రాణి, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ వేణు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

■ చౌటపల్లి విద్యార్థుల ఆందోళన

గుడివాడ టౌన్: రూరల్ మండలం చౌటపల్లి జెడ్పీ హైస్కూల్లో శనివారం విద్యార్థులు నిరసన తెలిపారు. తమ వ్యాయామ ఉపాధ్యాయుడు మూడో తరగతి చిన్నారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని పోలీసులకు చిన్నారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఆ ఉపాధ్యాయుడ్ని పోక్సో చట్టం కింద అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో పాఠశాల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం భారీగా నిరసన తెలిపారు. అక్రమ కేసులతో వ్యాయామ ఉపాధ్యాయుడ్ని జైలుకు పంపారని, తక్షణమే కేసు ఉపసంహరించుకోని పక్షంలో నిరసన మానేది లేదంటూ విద్యార్థులు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులతో స్థానికులు చర్చలు జరిపి కేసు ఉపసంహరించుకునేలా చేశారు. దీనికి ఫిర్యాదుచేసిన చిన్నారి తల్లిదండ్రులు అంగీకరించడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

■ వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి



గుడ్లవల్లేరు: కౌతవరం వైఎస్సార్ సీపీ నాయకుడు వడ్లమూడి నాగమోహన్ శనివారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు తెలిపారు. ఆదివారం కౌతవరంలో అంత్యక్రియలు ఉంటాయని పేర్కొన్నారు.

■ తల్లులు పోషకాహారం తీసుకోవాలి

కైకలూరు: తల్లులు పోషకాహారం తీసుకుంటే పుటబోయే బిడ్డలు బాగుంటారని సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా కైకలూరు వెలంపేట 16వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై ఐసీడీఎస్ సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు.

■ భోగేశ్వరస్వామి దేవస్థాన ఈఓగా శేఖర్

కలిదిండి(కై కలూరు): కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి ఆలయ ఈఓగా కైకలూరు శ్యామలాంబ దేవస్థాన ఈఓ వీఎన్‌కే శేఖర్ నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. తాడినాడ గ్రూపు ఆలయాలకు కూడా ఈఓగా శేఖర్ విధులు నిర్వహించనున్నారు.

■ కార్నియాల సేకరణ

గుడివాడ టౌన్: స్థానిక మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్నియాలు సేకరించినట్లు సంస్థ కార్యదర్శి ఎస్.పద్మజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివాడ మండలం తుమ్మలపల్లికి చెందిన గూడపాటి బేబీ సరోజిని మృతి అనంతరం కుటుంబ సభ్యుల అనుమతితో ఐబాల్స్(కార్నియాలు) సేకరించి విజయవాడ ఎల్‌బీ ప్రసాదు ఆస్పత్రికి చేరవేసినట్లు ఆమె పేర్కొన్నారు.